నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com

మంగళవారం 24-06-2025

పేజీలు: 02




ఇరాన్‌తో యుద్ధం ముగిసిందంటూ

# ట్రంప్ పోస్టు

ఇరాన్-ఇజ్రాయెల్‌యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన జారీ చేశారు. యుద్ధం ముగిసిందంటూ ట్రంప్ పోస్ట్ పెట్టారు. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు. 24 గంటల్లో సీజ్ ఫైర్ అమలులోకి వస్తుందని చెప్పారు. 12 రోజుల యుద్ధానికి ఇది ముగింపు అని ప్రకటించారు.
పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్ పై అమెరికా నుంచి తీవ్రస్థాయి దాడులు చేసిన వెంటనే మరుసటి రోజు ఇజ్రాయెల్ ఆ దేశంపై ముప్పేట దాడులు చేయడంతో ఇరాన్ విలవిలలాడిపోయింది. ఇజ్రాయెల్ చేసిన ఎదురుదాడులను ఇరాన్ ప్రతిఘటించింది. అత్యంత వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్ సోమవారం ఇరాన్ సైన్యం ఇరానియన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జి) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. మరో వైపు ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఎవిన్ ప్రిజన్‌ను కూడా ధ్వంసం చేసింది. ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై ట్రూప్రామిస్ త్రీ పేరిట సైనిక చర్యకు దిగిందని సైనిక వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ నగరాలు జెరూసలెం, హాఫియా, టెల్ అవీవ్‌పై ఇరాన్ దాడులకు పాల్పడింది.



## లక్ష్యం ప్రపంచ చాంపియన్‌షిప్

టోక్యో వేదికగా జరిగే ప్రతిష్టాత్మక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలువడమే తన లక్ష్యమని భారత స్టార్ అథ్లెట్ నీరజ్‌చోప్రా ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. మంగళవారం జరిగే గోల్డెన్‌స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో బరిలోకి దిగుతున్న నీరజ్ తన లక్ష్యాలను వివరించాడు. దోహాలో జరిగిన డైమండ్ లీగ్ పోటీలో తొలిసారి 90మీటర్ల మార్క్ అందుకున్న నీరజ్.. తాజాగా ముగిసిన పారిస్‌లో టాప్‌లో నిలిచి సత్తాచాటాడు. దిగ్గజ జావెలిన్‌త్రో కోచ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెజ్నీ దగ్గర శిక్షణ పొందుతున్న తాను ఇటీవలి సాధించిన విజయాలతో మరింత ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకున్నానని తెలిపాడు.

## మాజీ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూత



టీమిండియా మాజీ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూశారు. ఆయన వయసు 77 ఏళ్లు. లండన్‌లో ఆయన గుండె సంబంధిత వ్యాధితో మరణించారు. కొన్ని దశాబ్దాల నుంచి ఆయన లండన్‌లోనే నివాసం ఉంటున్నారు. టీమిండియా తరపున 33 టెస్టులు ఆడిన దిలీప్.. 114 వికెట్లు తీసుకున్నాడు. అయిదేసి వికెట్లు అతను ఆరు సార్లు తీసుకున్నాడు. 15 వన్డేల్లో అతను 22 వికెట్లు తీసుకున్నాడు. సౌరాష్ట్ర, బెంగాల్, వార్‌విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్‌కు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. 1970 దశకంలో ఉన్న మేటి స్పిన్నర్ల దారిలో దిలీప్ దోషి ముందుకు సాగాడు. అతను 32 ఏళ్ల వయసులో టెస్టు అరంగేట్రం చేశాడు. నాటింగ్‌హామ్‌షైర్‌లో లెజండరీ గ్యారీఫీల్డ్ సోబర్స్‌తో కలిసి ఆడేవాడు. 1980 దశకంలో అతను స్వల్ప సమయంలోనే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఆ దశలో ఇండియన్ క్రికెట్ నడుస్తున్న తీరును ఆయన ఇష్టపడలేదు. స్పిన్ పంచ్ పేరుతో ఆటోబయోగ్రఫీ బుక్ రాశాడతను. దాంట్లో క్రికెట్ అనుభవాల గురించి చెప్పాడు.

# స్పేస్‌లోకి తెలుగమ్మాయి

## టైటాన్ స్పేస్ మిషన్‌కు ఎంపికైన దండేటి జాహ్నవి



అంతరిక్షంలోకి వెళ్లడం అంటే అంత ఆషామాషీ కాదు. అందరికీ కూడా సాధ్యం కాదు. కానీ, అటువంటిది ఓ తెలుగమ్మాయి ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేయబోతోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంగేటి జాహ్నవి అనే 23 ఏళ్ల తెలుగమ్మాయి అంతరిక్షంలోకి వెళ్లనుంది. ఆమె అమెరికా అంతరిక్ష పరిశోధ సంస్థ నాసా, ప్రయివేట్ వాణిజ్య సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ (TSI) సంయుక్తంగా చేపట్టే అంతరిక్ష యాత్రలో వ్యోమగామిగా పాల్గొననుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె నిలవనుంది. 2029 మార్చిలో ఆమె అంతరిక్షంలోకి వెళ్లి అక్కడ ఐదు గంటలపాటు గడపనుంది.
అమెరికాకు చెందిన టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ అనే ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ అంతరిక్ష యాత్రను చేపడుతోంది. ఈ యాత్ర కోసం జాహ్నవిని వ్యోమగామిగా (ASCA) ఎంపిక చేశారు. భారత్‌లో పుట్టి ఇక్కడే నివసిస్తున్న ఏ మహిళ కూడా ఇంతకు ముందు నేరుగా అంతరిక్ష యానానికి ఎంపిక కాలేదు.
ఇప్పుడు జాహ్నవి ఆ ఘనత సాధించింది. టైటాన్ స్పేస్ సంస్థ నిర్వహించిన పరీక్షలన్నిటిలో ప్రతిభ చూపిన జాహ్నవి.. అంతరిక్ష యాత్ర అర్హత సాధించింది. టైటాన్ స్పేస్ రోదసీలో ఒక పెద్ద అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించనుంది. భవిష్యత్తులో ఇది అంతరిక్ష ప్రయోగాలకు, వ్యాపారానికి, పర్యాటకానికి కేంద్రంగా మారుతుంది. ఇక, భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా సైతం ఆక్జియమ్ మిషన్‌లో భాగంగా త్వరలోనే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. ఈ యాత్రలో మొదట కొద్దిమంది పరిశోధకులను, పర్యాటకులను అంతరిక్షంలోకి తీసుకువెళ్తారు. 2029 మార్చిలో మొదటి యాత్ర జరుగుతుంది. అందులో జాహ్నవి భారతదేశం నుంచి పాల్గొంటుంది. ఆమె ఐదు గంటలపాటు అంతరిక్షంలో ఉంటుంది. దీనికి ఎంపికైన వారికి అమెరికాతో పాటు ఇతర దేశాల్లో మూడేళ్లపాటు శిక్షణ ఇస్తారు. ఈ యాత్రకు సంబంధించిన వివరాలు త్వరలో ప్రకటిస్తారు. ఇక, జాహ్నవి 2021లో నాసా నిర్వహించిన 'ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్'కు భారతదేశం తరఫున ఎంపికై రికార్డు సృష్టించింది. ఆ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ, 'కువైట్‌లో తన తల్లిదండ్రులు శ్రీనివాస్, పద్మశ్రీలు ఉద్యోగం చేస్తున్నారు. నేను అమ్మమ్మ దగ్గరే పెరిగాను. మా అమ్మమ్మ లీలావతి చందమామ కథలు చెప్పేది. దీంతో నేను అంతరిక్షంలోకి వెళ్లాలని కలలు కనేదాన్ని అని చెప్పింది. చిన్నప్పటి నుంచి ఆమెకు అంతరిక్షంపై ఉన్న ఆసక్తి ఆమెను ఈ స్థాయికి చేర్చింది. అయితే, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విద్యా కార్యక్రమాల్లో భాగంగా ప్రేరణ కలిగించే ప్రసంగాలు, ఉపన్యాసాలు ఇచ్చిన జాహ్నవి.. నిట్‌లతో పాటు దేశవ్యాప్తంగా ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలలోని విద్యార్థులతో మమేకమయ్యారు. అనలాగ్ మిషన్లు, డీప్-సీ డైవింగ్, ఖగోళ శాస్త్రం, అంతరిక్షంలో దీర్ఘకాలిక జీవన సామర్థ్యంపై జరిగే అంతర్జాతీయ సదస్సులలో పాల్గొంటున్నారు. జాహ్నవి, అంతర్జాతీయ ఖగోళ శోధన సహకార సంస్థ (IASC) తో కలిసి Pan-STARRS టెలిస్కోప్ ఆధారంగా ఒక అస్టరాయిడ్‌ను తాత్కాలికంగా గుర్తించారు. ఆమె అంతర్జాతీయ స్థాయిలో స్పేస్ ఐస్‌లాండ్ నిర్వహించిన జియాలజీ శిక్షణ కోసం ఎంపికైన తొలి భారతీయురాలిగానే కాదు.. తక్కువ వయసులో ఎంపికైన విదేశీ అస్ట్రోనాట్‌గానూ గుర్తింపు పొందారు.



## బొల్లారంలో కూతురుపై అత్యాచారయత్నం

సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారం ప్రాంతంలో కన్న కూతురుపై తండ్రి అత్యాచారానికి యత్నించారు. తండ్రి మద్యం మత్తులో కూతురు శరీర భాగాలు తాకడంతో ఆమె తల్లికి చెప్పింది. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. మద్యం మత్తులో పలుమార్లు కుటుంబ సభ్యులతో గొడవకు దిగేవాడు.

## ముంబైకి పృథ్వీషా వీడ్కోలు



దేశవాళీ రంజీ దిగ్గజం ముంబై జట్టుకు స్టార్ క్రికెటర్ పృథ్వీషా గుడ్‌బై చెప్పాడు. గత కొంతకాలంగా ఫామ్‌లేమితో పాటు అనవసర వివాదాలతో వార్తల్లోకెక్కిన షా.. తాను ఇంతకాలం ప్రాతినిధ్యం వహించిన ముంబై జట్టును వీడాడు. రానున్న దేశవాళీ సీజన్‌లో కొత్త జట్టుకు ఆడేందుకు సిద్ధమైన ఈ 25 ఏండ్ల యువ క్రికెటర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) కోసం తాజాగా దరఖాస్తు చేసుకోగా.. ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) అందుకు అంగీకారం తెలిపింది. ఎంసీఏ సెక్రటరీ అభయ్ స్పందిస్తూ.. 'షా అద్భుత నైపుణ్యం గల క్రికెటర్. మేం అతడి నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం. భవిష్యత్‌లో అతడు మరింత విజయవంతమవ్వాలి' అని తెలిపాడు. ఈ క్రమంలో షా.. ఎమ్‌సీఏకు రాసిన లేఖలో స్పందిస్తూ 'ఇన్నాళ్లు ముంబైకి ఆడటం చాలా గర్వంగా ఉంది.

## 16 ఏళ్ల బాలికపై ఇద్దరు అత్యాచారం... ఆత్మహత్య



పక్కింట్లో ఇద్దరు వ్యక్తులు 16 ఏళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం చేయడంతో బాలిక విషం తీసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఫతేబాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం_ _ _ ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలిక తన తల్లిదండ్రులకు కలిసి ఉంటుంది. పక్కింట్లో ఉండే ఓ మహిళ తన ఇంటికి తీసుకెళ్లి మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చింది. సదరు మహిళ మేనల్లుడు, మరోక వ్యక్తి బాలికపై అత్యాచారం చేశారు. అనంతరం ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని బెదిరించారు. జూన్ 18న కడుపులో నొప్పితో పాటు వాంతులు అవుతున్నాయని బాలిక తన తల్లికి చెప్పింది. పక్కింట్లో ఉండే వ్యక్తి తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని చెప్పింది. విషం తాగానని చెప్పడంతో వెంటనే బాలికను మహారాజ అగ్రసేన్ మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ బాలిక మృతి చెందింది. పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

## రాష్ట్రంలో భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు..

రాష్ట్రంలో మరోసారి పెద్ద సంఖ్యలో అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇటీవలే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేసిన కాంగ్రెస్ సర్కార్ తాజాగా మున్సిపల్ కమిషనర్లకు ప్రమోషన్లు ఇవ్వడంతోపాటు స్థానచలనం కల్పించింది. ఒకేసారి 129 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టీ రాజేశ్వర్‌ను మహబూబాబాద్ కమినషర్‌గా బదిలీచేశారు.

## ఇజ్రాయిల్ నుంచి ఢిల్లీ చేరుకున్న 161 మంది భారతీయులు



ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య వార్ వల్ల.. అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు ఆపరేషన్ సింధు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న సుమారు 161 మంది ఇవాళ ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ చేరుకున్నారు. తొలుత వాళ్లు భూమార్గంలో జోర్డాన్‌కు వెళ్లి.. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వచ్చారు. సురక్షితంగా ఢిల్లీ చేరుకున్న అరవింద్ శుక్లా అనే ప్రయాణికుడు ఆ ఆపరేషన్ గురించి వివరించాడు. తాము ఇజ్రాయిల్ నుంచి వచ్చామని, జోర్డాన్ నుంచి తమ విమానం ప్రారంభమైందన్నాడు. గత సెప్టెంబర్‌లో ఇజ్రాయిల్‌కు వెళ్లినట్లు చెప్పాడతను. అక్కడ పరిస్థితి బాగా లేదని, తలపై నుంచి మిస్సైళ్లు వెళ్లడాన్ని చూసినట్లు పేర్కొన్నాడు. చాలా భయానక పరిస్థితులు ఉన్నాయన్నాడు. ఓ హాస్టల్‌లో ఉన్నామని, రాత్రిపూట మొత్తం సైరన్లు వినిపించేవాని, ఆ టైంలో మేం బంకర్లకు వెళ్లేమాళ్లమన్నాడు. తాను జెరుసలాంలో ఉన్నట్లు ఆ వ్యక్తి తెలిపాడు. తమను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చిన ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పాడు. 160 మంది చాలా క్రమ పద్ధతిలో తీసుకువచ్చినట్లు చెప్పాడతను. ఆహారం, నీళ్లు, అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. ఎయిర్‌స్పేస్ సమస్యల వల్ల విమానం ఆలస్యమైందన్నాడు. ఎంబసీ సిబ్బంది తమకు సహకరించినట్లు తెలిపాడు. ఇజ్రాయిల్ నుంచి ఇండియా చేరుకున్న వారిలో ఓ వృద్ధ జంట కూడా ఉన్నది. తమ కొడుకు ఇజ్రాయిల్‌లో ఉన్నాడని, తమకు మనువడు పుట్టాడని, వాళ్లు అక్కడే ఉంటారని, తాము మాత్రమే ఇండియాకు వచ్చినట్లు త్రయంబక్ కోలే తెలిపారు. తమను సురక్షితంగా తీసుకువచ్చిన భారత ప్రభుత్వానికి థ్యాంక్స్ తెలిపారు. తమ తలల పైనుంచి బాంబులు వెళ్లడాన్ని చూసినట్లు అతను తెలిపాడు.

## నభా నటేశ్ హాట్ లుక్స్



సినీరంగంలోకి ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది ఈ హీరోయిన్. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే నటనపై ఆసక్తితో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ ఈ బ్యూటీ నటించిన సినిమాలు అంతగా మెప్పించకపోవడంతో ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో బ్రేక్ రాలేదు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ కారణంగా సినిమాలకు దూరమైన ఈ వయ్యారి.. కొన్నాళ్లు సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. హీరోయిన్ నభా నటేష్. ప్రస్తుతం యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఇందులో సంయుక్త మీనన్ సైతం కథానాయికగా నటిస్తుంది. తాజాగా నభా నటేష్ కు క్రేజీ ఆఫర్ వచ్చినట్లుగా తెలుస్తోంది. టాలీవుడ్ డైరెక్టర్ గోపిచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో జాట్ అనే సినిమా రూపొందుతుంది. పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ సినిమాగా వస్తోన్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.



## ఇరాన్‌తో కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నాం: ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యహూ

ఇరాన్‌తో ద్వైపాక్షిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ తెలిపారు. ఒకవేళ ఎటువంటి అతిక్రమణ జరిగినా.. అప్పుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతామన్నారు. గత 12 రోజులుగా ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య భీకర వైమానిక దాడులు జరిగిన విషయం తెలిసిందే. ఇరాన్‌లో ఉన్న న్యూక్లియర్ సైట్లపై అమెరికా దాడి చేసిన తర్వాత.. ఇరు దేశాల మధ్య కాల్పుల విమరణ డీల్ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే అమెరికా చేసిన ప్రతిపాదనను అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయం దీనిపై ప్రటకన చేసింది. క్యాబినెట్, రక్షణ మంత్రి, ఐడీఎఫ్ చీఫ్, మొసాద్ అధినేతతో పాటు కీలక నేతల్ని ప్రధాని నెతన్యహూ చర్చించారని, ఆపరేషన్ రైజింగ్ లయన్ లక్ష్యాలను అందుకున్నట్లు పీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది. న్యూక్లియర్, బాలిస్టిక్ మిస్సైళ్ల నుంచి పొంచి ఉన్న ప్రమాదం పోయిందని ఇజ్రాయిల్ చెప్పింది. ఇరాన్ గగనతలాన్ని పూర్తిగా ఐడీఎఫ్ ఆధీనంలో తీసుకున్నట్లు ఆ ప్రకటనలో చెప్పారు. ఇరాన్‌లో కీలక టార్గెట్లపై అటాక్ చేశామని, ఆ దేశ సైనిక నేతలకు తీవ్ర నష్టం జరిగినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. తమకు సపోర్టు ఇచ్చినందుకు, అణు భయాన్ని తొలగించినందుకు అమెరికాకు థ్యాంక్స్ చెబుతున్నట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఆపరేషన్ రైజింగ్ లయన్ లక్ష్యాలు నెరవేరిన సందర్భంగా.. ప్రెసిడెంట్ ట్రంప్ సహకారం మేరకు.. ద్వైపాక్షిక సీజ్‌ఫైర్‌కు అంగీకరించామని ఇజ్రాయిల్ పీఎంవో తెలిపింది.



## పిచ్చుకల్లోనూ అద్భుతమైన ఇంజినీర్

ప్రకృతి మనకు అన్ని ఇస్తుంది. అందుకే ఒక ఆంగ్ల కవి విలియం వర్డ్స్ వర్త్ ప్రకృతి గూర్చి ఇలా అన్నాడు. ప్రకృతి ఒక టీచర్, ఒక ఇంజినీర్, ఒక డాక్టర్, ఒక సైంటిస్ట్, ఒక దైవంగా చెప్పాడు. ఈ సృష్టిలో అంతులేని సంపద దాగి ఉంది. సంపద అంటే ధనం మాత్రమే కాదు భూమిలో ఉన్న బంగారం, బొగ్గు, చమురు నిల్వలు మొదలైనవి. మానవుడు నాగరికత ప్రపంచంలోకి వచ్చాక అన్నింటిపై క్షుణ్ణంగా తెలుసుకోవడం మొదలు పెట్టాడు. భూగోళం, ఖగోళం మాత్రమే కాకుండా అణువు, పరమాణువును సృష్టించి అణు రియాక్టర్లను సైతం పదిలపరిచే వరకు వెళ్లాడు.ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే ప్రకృతిలో గిజిగాడు అనేది ఒక రకమైన పిచ్చుక. ఆడ పక్షి గూటిలో పిల్లలకు ఆహారం ముక్కుతో అందిస్తే, మగ పక్షి గూడు అల్లుతుంది. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, వ్యవసాయ బావుల్లో ఏపుగా ఉన్న తుమ్మ చెట్ల కొమ్మలకు ఈ పక్షి గూడు కడుతుంది. ఇప్పుడున్న ఇంజనీర్ల మతి భ్రమించేలా ఈ గూళ్ల నిర్మాణం ఉంటుంది. ఒక్కొక్క గడ్డి పోచను ముక్కుతో తీసుకు వచ్చి పకడ్బందీగా గూడు నిర్మిస్తుంది. మనుషుల వలెనే గీజుగాడు పక్షులన్నీ ఒక వద్దనే గూళ్లు నిర్మించుకుంటాయి. గాలి బాగా వీస్తే గూళ్లు తెగి బావిలో పడుతుంది అనే విధంగా ఈ గూళ్లు ఉంటాయి. బలమైన గాలి మాత్రమే కాదు వర్షం పడిన గూటిలో ఉన్న పిల్లలు తడవకుండా ఈ పక్షులు గూళ్లు నిర్మిస్తాయి.



# బనకచర్ల బంకను మాపై రుద్దే యత్నం

వ్యవసాయం దండగ కాదు పండుగ అని చెబుతున్నామని రెవెన్యూ, హౌజింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేబినెట్ భేటీ అనంతరం ఆయన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి సచివాలయంలో సోమవారం రాత్రి 10 గంటలకు ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లను రైతులు ఖాతాల్లో వేసినందుకు రాష్ట్ర రైతుల పక్షాన మంత్రివర్గ భేటీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు శుభాకాంక్షలు తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు. నేడు సెక్రటేరియట్ వద్ద రైతు సంబురాలు జరపాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. దీంతోపాటు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో పండుగ వాతావరణంలో ఈ సంబురాలు జరుపుకోవాలని నిర్ణయించామన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మర్చిపోతే ఈ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌లలో నవంబర్ 9వ తేదీ లోపు లోపు తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. సుమారుగా 201 కిలోమీటర్ల చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణభాగం అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు. బనకచర్లలో భాగంగా అప్పటి ప్రభుత్వం 2016 అఫెక్స్ కౌన్సిల్ సమావేశంలో 400 టిఎంసీల ఎత్తిపోతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, బనకచర్ల అనే బంకను ఈ ప్రభుత్వానికి రుద్దాలని చూసిందని ఆయన ఆరోపించారు.

స్పోర్ట్ హబ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు: మంత్రి వాకిటి

పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నూతన స్పోర్ట్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేలా, క్రీడా ప్రమాణాలను పెంపొందించేలా నూతన స్పోర్ట్ పాలసీకి కేబినెట్ ఆమోదించిందన్నారు. ఈ పాలసీలో భాగంగా తెలంగాణ స్పోర్ట్ హబ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఒలంపిక్స్‌లో మన యువత సత్తా చూపించాలన్న ఉద్దేశ్యంతో ఈ పాలసీని రూపొందించామని ఆయన తెలిపారు. 2036లో జరిగే ఒలంపిక్స్‌లో తెలంగాణ తరపున పతకాలను సాధించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందులో భాగంగా తెలంగాణ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలని నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా వారికి ప్రోత్సాహాలు అందించడం లాంటి చర్యలను చేపడుతున్నామని మంత్రి వాకిటి తెలిపారు. తెలంగాణ క్రీడా అభివృద్ధి నిధి (టిఎస్‌డిఎఫ్)ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఈ నిధి ఏర్పాటులో భాగంగా జిల్లాలో క్రీడా అభివృద్ధికి సంబంధించి ప్రతి ఏడాది జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో ఉండే క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సిబిఎఫ్)లో పది శాతం ఈ నిధికి కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. స్పోర్ట్ కోటా రిజర్వేషన్లకు అర్హత జాబితాలో సిఎం కప్ రాష్ట్ర స్థా యి విజేతలకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు.

డిసెంబర్ 9న ‘తెలంగాణ రైజింగ్ విజన్ పాలసీ’ ఆవిష్కరణ: మంత్రి పొన్నం

బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ డాక్యుమెంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్ తో పాటు, ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తుందన్నారు. హుస్నాబాద్‌లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు కోర్సులకు గాను 240 సీట్లతోఒ అడ్మిషన్‌ల ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. శాతవాహన యూనివర్సిటీలో లా కాలేజీ ఏర్పాటులో భాగంగా ఎల్ఎల్‌బి సీట్లు 60 సీట్లు, ఎల్ఎల్ఎం సీట్లు 60 సీట్లకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో క్యాన్సర్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి పద్మశ్రీ అవార్డు గ్రహీత నోరి దత్తాత్రేయను సలహాదారుడిగా నియమించుకోవాలని కేబినెట్ నిర్ణయించిందని ఆయన తెలిపారు. దీంతోపాటు పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కోర్టు తీర్పు ప్రకారమే నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.



## చింతపండును రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల ...

చింతపండులో మంచి కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఇ, కె, సి, బి1, బి2, బి5, బి3, బి6 తో పాటుగా సోడియం, ఐరన్, ఎనర్జీ, జింక్, ఫాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయి.చింతపండులో ఉండే హైడ్రక్సీ సిట్రిక్ యాసిడ్ మనలో ఫ్యాట్ ప్రొడక్షన్ను తగ్గిస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే హెచ్‌సీఏ ఫ్యాట్ నిల్వలకు కారణమయ్యే ఎంజైమ్స్‌కు అడ్డుగా నిలుస్తుంది.చింతపండు తీసుకొంటే వ్యాయామం చేస్తున్నప్పుడు కొవ్వు తొందరగా కరిగేందుకు కూడా ఇది ఎంతో సహాయపడుతుందట. బరువు తగ్గాలనుకొంటే తప్పకుండా ప్రతిరోజూ దీని తీసుకోండి. చింతపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుంది. బాడీలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను కూడా తగ్గిస్తుంది. అంతేకాదు ఈ చింతపండు గుండె ఆరోగ్యానికి ఎంతో సహాయపడుతుంది.చింతపండును రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. చింతపండులో పాలీఫెనాల్స్, ఫ్లెవనాయిడ్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. అంతేకాదు దీనితో మెటబాలిజం కూడా పెరుగు తుంది. తద్వారా ఆకలి చాలా వరకు తగ్గుతుంది. దీంతో మీరు ఈజీగా వెయిట్ లాస్ అవుతారు.



## ట్రాన్స్ జెండర్స్‌కు గుర్తింపు కార్డులు పంపిణీ

ఆత్మ గౌరవం తో ట్రాన్స్ జెండర్స్ జీవనం గడపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ అన్నారు. మంగళ వారం సూర్యాపేట కలెక్టరేట్ లో హుజూర్ నగర్ ట్రాన్స్ జెండర్స్ కు ఐడెంటీ కార్డ్స్, ధ్రువీకరణ పత్రాలు అందజేసి మాట్లాడారు. ట్రాన్స్ జెండర్స్ స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకొని సమాజంలో గౌరవంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పరంగా మంజూరయ్యే అన్ని పథకాలు అందిస్తామన్నారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047

# లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడి

డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలో ఉంటే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందో ఏడాది కాలంలోనే చేసి చూపించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతిలో కూటమి ప్రభుత్వం ‘సుపరిపాలనలో తొలి అడుగు’ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఊహించిన దానికంటే ఎక్కువగానే పనులు చేశామని, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047ను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన అనుభవంతో, ప్రతిసారీ సమర్థవంతమైన, సుపరిపాలన అందించానని గుర్తుచేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వారి అసమర్థ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతిన్నదని ఆరోపించారు. మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్ర ప్రగతి ఆగిపోయిందని, ఈ 'మూడు ముక్కలాట'తో రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, వైసీపీ హయాంలో నిధులు పక్కదారి పట్టి దుర్వినియోగం అయ్యాయని విమర్శించారు.తాము అధికారంలోకి వచ్చిన



వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి కీలక దస్త్రాలపై సంతకాలు చేశామని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 213 అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం 5 రూపాయలకే భోజనం అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, అదే రోజున ఆటో డ్రైవర్లకు కూడా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ‘తల్లికి వందనం’ పథకం హామీని నిలబెట్టుకున్నామని, అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఒకటో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నామని తెలిపారు.రాయలసీమలో ముఠా తగాదాలను పూర్తిగా అరికట్టామని, గంజాయి సాగును సమూలంగా నిర్మూలించామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమరావతి నిర్మాణ పనులను తిరిగి పట్టాలెక్కించామని, మూడేళ్లలో పూర్తి చేసి ప్రధాని మోదీని ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తామని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,500 కోట్లు కేటాయించారని, విశాఖ రైల్వే జోన్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటివరకు 31 పారిశ్రామిక పాలసీలను తీసుకొచ్చామని పేర్కొన్నారు.స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనే ధ్యేయంగా పనిచేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2.6 లక్షలుగా ఉందని, 2047 నాటికి దీనిని రూ.55 లక్షలకు పెంచడమే లక్ష్యమని నిర్దేశించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ పెరిగితే నిరంతరాయంగా రెవెన్యూ వృద్ధి చెందుతుందని, 2029 నాటికి తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ గణనీయంగా పెరగాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీ-4 పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

## సిజ్లింగ్ నిధి



17 ఆగస్టు 1993న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో జన్మించింది వయ్యారి భామ నిధి అగర్వాల్. పెరిగింది మాత్రం బెంగుళూరులో. హిందీ మాట్లాడే మార్వాడీ కుటుంబంలో జన్మించినప్పటికీ తెలుగు, తమిళం, కన్నడ భాషలను అర్థం చేసుకోవడంతోపాటు మాట్లాడగలదు ఈ బ్యూటీ.2014లో మిస్ దివా యూనివర్స్ పోటీల్లో పాల్గొంది అందాల భామ నిధి అగర్వాల్. ఆ తర్వాత హీరోయిన్ గా మారింది. హిందీలో మున్నా మైకెల్ అనే సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. ఈ సినిమా తర్వాత టాలీవుడ్ కు మకాం మార్చింది.2018లో అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో తెలుగు చలన చిత్ర అరంగేట్రం చేసింది. ఈ సినిమా అంతగా మెప్పించలేకపోయిన తెలుగులో మంచి క్రేజ్ అందుకుంది. తర్వాత వరుస సినిమాలు క్యూ కట్టాయి. 2019లో అక్కినేని అఖిల్‌కు జోడిగా మిస్టర్ మజ్ను సినిమా సినిమాలు ఫ్లాప్ అయింది.